# సాక్షి
## వికారాబాద్

మంగళవారం ꠰ 23 ꠰ ఏప్రిల్ ꠰ 2024






### డాక్టర్లు లేక అవస్థలు

ధారూరు మండలం నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



### పంట నష్టాన్ని నివేదిస్తాం

వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి నివేదిక అందజేస్తామని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి తెలిపారు. 8లో▸



### తిండికూడా తిననివ్వరా?

డ్రైవర్‌పై చేయిచేసుకున్న ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. 9లో▸

## న్యూస్‌రీల్

### హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ కోటిరెడ్డి

**అనంతగిరి:** లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లాలో మంగళవారం హనుమాన్ జయంతి, శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రజలు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీసులు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సకే అర్హులు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్

**అనంతగిరి:** ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్ సోమవారం హెచ్చరించారు. ప్రైవేట్ క్లినిక్‌లలో బెడ్స్, మందులు ఉండరాదని ఆదేశించారు. ఆయుష్ వైద్యులు అల్లోపతి వైద్యం చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంబీబీఎస్ అంతకంటే పైస్థాయి డిగ్రీ ఉన్న వారు మాత్రమే అల్లోపతి వైద్యం చేయాలన్నారు. అల్లోపతి డాక్టర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో తప్పని సరిగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్స్ సెంటర్లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ - 2010 ప్రకారం ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు, గైనకాలజిస్టులు కూడా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు పని వేళల్లో క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉండాలన్నారు. బయో మెడికల్ వెస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు అందే సేవలు, వాటికి అయ్యే ఖర్చు వివరాలను సూచిక బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు.

### సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

**కొడంగల్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. బహిరంగ సభ వద్ద ఏర్పాట్లు, హెలిప్యాడ్ తదితర విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మద్దూరు మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి బావోజీ శ్రీ గురు లోకమసంద్ ప్రభు జాతరలో పాల్గొని దేవస్థానంలో పూజలు నిర్వహిస్తారని పార్టీ నేతలు తెలిపారు.

### ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి

**పెద్దేముల్:** మరోసారి ఎంపీగా అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని గొట్లపల్లి, తట్టిపల్లిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా పూర్తి సమయం ప్రజల కోసం, అభివృద్ధి కోసం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలోనే బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కనబడతారని, ఆ తరువాత అందుబాటులో ఉండరని ఆరోపించారు. అపాయింట్‌మెంట్ ఇవ్వని కొండా ప్రజలు రిటైర్మెంట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**ఆగస్టులో రుణమాఫీ: ఎమ్మెల్యే**

ఆగస్టు 15వ తేదీ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే ఎన్నికల హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గుడి, మతం పేరుతో ఓట్లు అడిగే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధారాసింగ్, గోపాల్, అనురాధ, సునితా సంపత్, మధులత, లొంక నర్సింలు, శంకర్‌నాయక్, లక్ష్మారెడ్డి, రియాజ్, ప్రవీణ్, బందెప్ప, రాకేష్, నారాయణ పాల్గొన్నారు.

# 4 రోజులు 11 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**కొనసాగుతున్న లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియ**

- బీజేపీ అభ్యర్థి కొండా, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని సహా పలువురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు
- ఇప్పటి వరకు మొత్తం 23కు చేరిన సంఖ్య

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల స్థానానికి నాలుగో రోజైన సోమవారం 11 దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తొట్ల రాఘవేందర్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ తరఫున అభ్యర్థిగా మహమ్మద్ సలీం, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలు అందజేసినట్టు చెప్పారు. వీరితో పాటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రజా ఎక్తా పార్టీ అభ్యర్థిగా సానెమ్ రాజ్ గౌడ్, ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇంక్విలాబ్-ఇ-మిలాత్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ అబ్దుల్ ఖావీ అబ్బాసీ, స్వతంత్ర అభ్యర్థులుగా జి.మల్లేషం గౌడ్, మహ్మద్ అఫ్సర్ ఖుద్దుస్, ఖడ్గేకార్ శ్రీనివాస్, ఇస్లావత్ పాండు నాయక్, అమీర్ సాజిద్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 23 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన వివరించారు.

**సి-విజిల్‌ను సద్వినియోగం చేసుకోండి**

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సి-విజిల్ యాప్ ద్వారా 85 ఫిర్యాదులు రాగా, ఇప్పటికే వాటిని పరిష్కరించినట్టు చెప్పారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసిన సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అందుకే ఎలక్షన్ కమిషన్ ప్రజల చేతిలో సి-విజిల్ అనే బ్రహ్మాస్త్రం పెట్టిందని అన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ఎవరైనా సరే సీవిజిల్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందన్నారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సివిజిల్ యాప్ సురక్షితమైందని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువుగా ఉంటుందన్నారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించవచ్చని అన్నారు. జిల్లా ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

# గ్రంథాలయాలు చైతన్య వేదికలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

- గ్రంథ పఠనం చరిత్ర పుటల్ని మారుస్తుంది
- లైబ్రరీలను యువత సద్వినియోగం చేసుకోవాలి
- ప్రొఫెసర్ కోదండరామ్

**బొంరాస్‌పేట:** గ్రంథ పఠనం యువతను విజ్ఞానవంతులను చేసి చరిత్ర పుటల్ని మార్చేలా చేస్తుందని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం కొడంగల్ మండలం సంగాయిపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హన్మయ్య తన తల్లిదండ్రుల పేరున ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు చైతన్య వేదికలన్నారు. నిజాం పాలనలో రాజులు, దొరలను ప్రశ్నించే యువతను తయారు చేశాయాన్నారు. రజాకార్ల పాలనను కుప్పకూల్చాయని గుర్తుచేశారు. తెలంగాణ యువతను చైతన్యం చేసి స్వరాష్ట్రం ఏర్పాటుకు దోహద పడ్డాయనడంతో సందేహం లేదన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతలో అలవాట్లను, ఆలోచన విధానాన్ని మార్చి చైతన్య వేదికలు గ్రంథాలయాలని పేర్కొన్నారు. కాలక్షేపం కోసం టీవీ, సెల్‌ఫోన్ వాడకం సరైంది కాదని, వాటిని తగ్గించి గ్రంథ పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

**కొడంగల్ ప్రజలు చైతన్యవంతులు**

కొడంగల్ నియోజకవర్గం కర్ణాటక, తెలంగాణ సరిహద్దులో ఉన్నా ఇక్కడి ప్రజలు ఎంతో చైతన్యవంతులని కోదండరామ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గట్టి పోరాటాన్ని అందించారని ప్రశంసించారు. గ్రంథాలయ ఏర్పాటు కర్త హన్మయ్యను సన్మానించి అభినందించారు. హన్మయ్య తల్లి శివమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయంలో తొలి పాఠకుడిగా సంతకం చేసి పుస్తకాలను పరిశీలించారు. పత్రికా ఎడిటర్ కే శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు తదితరులు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. హన్మయ్య సేవలను అభినందించారు. కార్యక్రమంలో శతావధాని మలుగు అంజయ్య, టీపీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, విజయలక్ష్మి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, నందారం ప్రశాంత్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏనుగుల భాస్కర్, రాధాకృష్ణ, ఎంఈఓ రాంరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

# కల్యాణం.. అంగరంగ వైభవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**చిలుకూరులో భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు**

**మొయినాబాద్:** పచ్చని తోరణాలు.. పూల పందిరి.. మంగళవాయిద్యాలు.. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణం అర్ధరాత్రి 2 గంటల వరకు కనుల పండువగా సాగింది. ముందుగా శ్రీవారు వెంకన్నస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవాలయం సమీపంలోని మండపంలో వేంచేయించారు. అనంతరం అమ్మవార్లను కూడా ఊరేగింపుగా స్వామివారి చెంతకు తీసుకెళ్లి ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి, అమ్మవార్ల తరఫువారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆలయ అర్చకులు నృత్యాలు చేస్తూ ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని రక్తికట్టించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ గర్భగుడి వెనకభాగంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో ఆసీనులను చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ముందుగా విష్వక్సేనుని ఆరాధించి శుద్ధివచనం, పుణ్యాహవచనాలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణ స్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరవాస్తు రామాచారి, నరసింహన్, కన్నయ్య, కిట్టు, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన పంచాయతీ**

కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు చిలుకూరు పంచాయతీ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. పంచాయతీ ప్రత్యేక అధికారి సంధ్య, కార్యదర్శి వెంకటేశ్ సిబ్బందితో కలిసి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

**స్వామివారికి వాహనసేవలు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను జగవాహనంపై ఊరేగించారు.

# పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదు



పరిగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామ్మోహన్‌రెడ్డి, సీతారెడ్డి

- దేశ ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పరిగి:** కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డితో కలసి పరిగి పట్టణంలో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. దేశంలోని ఏ గ్రామానికి వెళ్లినా మా హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందని తెలిపారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. బీజేపీ మతాన్ని, రాముని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ఎక్కడ చేసినా కాంగ్రెస్ మాటనే వినిపిస్తోందని అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఉమారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపూర్ సమీపంలో హెచ్చరిక బోర్డు లేని ప్రమాదకర మలుపు



# 90 రోజుల్లో 8 మంది మృత్యువాత

**యాలాల మండలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు**

- యాక్సిడెంట్లకు నిలయాలుగా మలుపులు
- నివారణ చర్యల్లో విఫలమవుతున్న పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు

**యాలాల:** మూడు నెలల కాలంలో యాలాల మండలంలో రోడ్డు ప్రమాదాలు భారీగా పెరిగాయి. ఇటీవల జరిగిన ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 12మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఇందుకు ప్రధాన కారణం డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ప్రమాదకరమైన మూల మలుపులు, హెచ్చరిక, బోర్డులు లేకపోవడమే. వీటికి తోడు భారీ గుంతలు, కంకర తేలిన రోడ్లే కారణమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు కానీ సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఆత్మహత్యల నివారణకు, రోడ్డు ప్రమాదాలకు కారణాలు తెలియజేస్తూ ప్రతి గ్రామంలో కళాజాత బృందాలతో ప్రదర్శనలు ఇచ్చేవారు. అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, వాహనాల తనిఖీలు చేపట్టేవారు. ప్రస్తుతం పోలీసులు ఇటువంటి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో ఆత్మహత్యలు లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి.

- ఇదే మార్గంలో బాగాయిపల్లి సమీపంలో ఒక మలుపు ఉంది. దువ్వచర్ల గేటు సమీపంలో మరో మలుపు ఉంది. ఆయా ప్రాంతాల వద్ద ఇదే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు, ఆటో బోల్తా పడటంతో మరో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి.
- బాగాయిపల్లి - రాస్నం మార్గంలో గుట్ట ఎక్కే సమయం, దిగేటప్పుడు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనం పూర్తిగా దగ్గరికి వచ్చేంత వరకు కనబడవు.
- యాలాల - దేవనూరు మార్గంలో గోరేపల్లి సమీపంలో ఉన్న మూల మలుపు తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. నెలలో ఎవరో ఒకరు రోడ్డు ప్రమాదానికి గురై చేతులు, కాళ్లు విరగొట్టుకుంటున్నారు.
- లక్ష్మీనారాయణపూర్ - అగ్గనూరు మార్గంలోని మలుపుల వద్ద హెచ్చరిక, సూచిక బోర్డులు లేవు. ఈ ప్రాంతంలో మార్చి 29న ఆటోను జీపు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.



అగ్గనూరు సమీపంలో ప్రమాదానికి గురైన ఆటో(ఫైల్)

**భారీగా బ్లాక్ స్పాట్లు**

మండలంలో చాలా వరకు నిరంతరం ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. అయినా పోలీసులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వారంలో ఏదో ఒక వాహనం ప్రమాదానికి గురై ప్రయాణికుల ప్రాణాలు పోవడమో లేదా క్షతగాత్రులు కావడమో జరుగుతోంది. అచ్యుతాపూర్ గేటు వద్ద ఉన్న మూల మలుపు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేవు. ఈ మూల మలుపు వద్ద ఫిబ్రవరి 11న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

- లక్ష్మీనారాయణపూర్ - తాండూరు మార్గంలో కొత్త కాగ్నా బ్రిడ్జి వరకు గుంతల రోడ్డు కారణంగా ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 5న ఈ మార్గంలోని కల్వర్టు సమీపంలో గోడరాయి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో కోస్గి మండలానికి చెందిన వ్యక్తి మృత్యువాత పడ్డారు. ఇదే మార్గంలో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి చెందాడు.
- ఇవే కాకుండా బెన్నూరు, జక్కేపల్లి సమీపంలో, రాఘవాపూర్ మూలమలుపు వద్ద, తిమ్మాయిపల్లి సమీపంలో, దౌలాపూర్ సబ్‌స్టేషన్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల వద్ద పోలీసులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### రసాయన కంపెనీల ఏర్పాటు వద్దు



కంపెనీలను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

**తాండూరు టౌన్:** పర్యావరణాన్ని కలుషితం చేసే ఇథనాల్ కంపెనీల ఏర్పాటును విరమించుకోవాలని ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు వెంకటయ్య అన్నారు. సోమవారం ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇథనాల్ కంపెనీ ఏర్పాట్లకు అనుమతి ఇచ్చిందని.. ఇప్పటికే ఎనిమిది కంపెనీలు స్థాపించారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలుష్యాన్ని వెదజల్లి భూ తాపాన్ని పెంచడంతో పాటు, పర్యావరణాన్ని నాశనం చేసే ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడ్తామని నిరసన వ్యక్తం చేస్తామన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిష్టప్ప, రైతులు చిన్న బందెప్ప, గోపాల్, నర్సింహులు ఉన్నారు.

### సమసమాజ స్థాపనకే లెనిన్ పోరాటం



లెనిన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మహేందర్

**పరిగి:** సమ సమాజ స్థాపనే లక్ష్యంగా లెనిన్ పోరాటం చేశారని ఆయన స్ఫూర్తితోనే కమ్యునిస్టులు పుట్టారని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మహేందర్ అన్నారు. సోమవారం లెనిన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీడిత ప్రజల విముక్తికి లెనిన్ చేసిన పోరాటం ప్రపంచం మరవదన్నారు. పెట్టుబడిదారి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించి చరిత్ర విప్లవోద్యమానికి నాందిపలకారన్నారు. ఆయన పోరాటాలతోనే అనేక చట్టాలను సాధించామనిని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యర్శి మల్లేశ్, నాయకులు బసిరెడ్డి, శ్రీకాంత్, శివకుమార్, మహేందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దశరథ్ చారి (ఫైల్)

**పహాడీషరీఫ్:** వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన దశరథ్ చారి(56) భార్య చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దశరథ్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# యూనిఫాంల బాధ్యత ఐక్య సంఘాలదే

- విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న మహిళా సంఘాల సభ్యులు
- పునఃప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం



విద్యార్థుల డ్రెస్ కొలతలు తీసుకుంటున్న సంఘాల సభ్యులు

**దౌల్తాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫాంలను అందించనున్నారు.

**ప్రభుత్వ ఆదేశాలు జారీ**

మండల పరిధిలో 55 ప్రభుత్వ పాఠశాలలో 4,600 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. వారికి జూన్ 12న పాఠశాల పునఃప్రారంభం అవుతుంది. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందిచాలని నిర్ణయించారు. దీంతో విద్యార్థులకు చదువులో ఆటంకం కలగకుండా ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ఈనెల 24లోపు మహిళా సంఘాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఐకేపీ సంఘాలకు ఆదేశాలు అందడంతో వారు వివరాలు సేకరిస్తున్నారు.

**ఒక్కో జతకు రూ.50**

విద్యార్థులకు ప్రతి ఏటా రెండే జతల యూనిఫాంలను అందిస్తున్నారు. ఒక్కో జతకు రూ.50చొప్పున రెండు జతలకు రూ.100లు మహిళా సంఘానికి అందిస్తారు. ప్రభుత్వం అందించే కుట్టుకూలి చార్జీలు సరిపోవని గ్రామ ఐక్య సంఘాలు పేర్కొంటున్నాయి. దీంతో కొంతమంది ఆసక్తి చూపడం లేదు. గతేడాది వరకు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను హెచ్‌ఎంలకు అప్పగించేవారు. పాఠశాల విధులతో పాటు ఈ పనులు భారం కావడంతో యూనిఫాంల బాధ్యతను గ్రామఐక్య సంఘాలకు అప్పగించారు. గతేడాది స్టిచ్చింగ్ చార్జీలు గిట్టుబాటు కాకపోవడంతో సకాలంలో స్టిచ్చింగ్ చేయకపోవడంతో యూనిఫాంలు అందించడంలో ఆలస్యమైంది. ఈ విద్యాసంవత్సరం ఎలాంటి అవరోధాలు ఉండకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న సంఘాలు విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించేలా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు పాఠశాలలకు క్షేత్రస్థాయిలో వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. – సాయన్న, ఏపీఎం, దౌల్తాబాద్

# పంట నష్టాన్ని అధికారులకు నివేదిస్తాం

పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి తదితరులు

**పరిగి:** వడగళ్లకు, వర్షంతో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి అన్నారు. సోమవారం ఆమె పరిధిలోని ఇబ్రహీంపూర్, పెద్దతండా తదితర గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. నష్టపోయిన పంటలను పరిశీలించి అంచన వేయాలని ఏఈఓలకు సూచించారు. వర్షాలకు ఎక్కువగా వరి పంట, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని వాటి వివరాలను రైతుల పేర్లతో పూర్తి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామని రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

# డాక్టర్లు లేక రోగుల అవస్థలు

కిందిస్థాయి సిబ్బందితోనే నాగసమందర్ పీహెచ్‌సీలో సేవలు



నాగసమందర్ పీహెచ్‌సీలో డాక్టర్ లేక బయటే నిలబడిన ఓ రోగి

**ధారూరు:** శాశ్వత డాక్టర్లు, ఫార్మాసిస్టులు, స్టాఫ్‌నర్సులు లేక పల్లెల్లో ఆరోగ్య కేంద్రాలు దుర్భలంగా మారాయి. కేవలం ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ఆస్పత్రుల్లో సేవలు కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దీనికి నిదర్శనంగా నిలిచింది. సోమవారం గ్రామానికి చెందిన కొంత మంది ఆస్పత్రికి వెళ్లి పర్మినెంట్ డాక్టర్ లేరని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా కుక్కింద పల్లె ఆరోగ్య కేంద్రంలో ఔట్ సోర్సింగ్ డాక్టర్, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్స్‌లు రోగులకు సరైన వైద్య సేవలు అందించడం లేదని వారు విచారం వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంగా పూర్తిస్థాయి డాక్టర్ లేక అరకొర వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఇన్‌చార్జి డాక్టర్‌గా ధారూరు పీహెచ్‌సీలో సుష్మా ఉన్నా ఎప్పుడో ఓసారి వచ్చి వెళుతున్నారన్నారు. పీహెచ్‌సీకి ప్రతిరోజు ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తుంటారని, వీరందరికీ పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు ఆస్పత్రిలో పర్మినెంట్ డాక్టర్‌ను నియమించాలని కోరారు.

**నిరంతరం వైద్య సేవలు**

నాగసమందర్ పీహెచ్‌సీలో నిరంతరం పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. డిప్యూటేషన్ వెళ్లిన ఫార్మాసిస్ట్‌ను వెనక్కి పిలిపిస్తున్నాం. కేరెల్లి స్టాఫ్‌నర్సులను ఇక్కడ విధులు నిర్వహించేలా చేశాం. సబ్ ఏఎన్ఎంలకు విడతల వారీగా పీహెచ్‌సీలో విధులు నిర్వహించేలా జాబ్ చార్ట్ తయారు చేశాం. ఎంపీ ఎన్నికల అనంతరం పీహెచ్‌సీకి పర్మినెంట్ డాక్టర్ రావచ్చు.
– సుష్మా, ఇన్‌చార్జి డాక్టర్, పీహెచ్‌సీ, నాగసమందర్

# కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోండి

పీఏసీఎస్ సీఈఓ బాలకిష్టయ్య




జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ బాలకిష్టయ్య

**మోమిన్‌పేట:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేకవనంపల్లి పీఏసీఎస్ సీఈఓ బాలకిష్టయ్య అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మేకవనంపల్లి పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటాలుకు ప్రభుత్వం మద్దతు ధర రూ.3,180లుగా నిర్ణయించిందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు నేరుగా రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. జొన్నల్లో మట్టి, పగిలిన, దుమ్ము, ధూళి లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**మహిళా సంఘం ఆధ్వర్యంలో**

**బొంరాస్‌పేట:** మండల పరిధిలోని ఏర్పుమళ్లలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు, నియమాల ప్రకారం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మహిళా సంఘం సభ్యులు తెలిపారు. తేమ, తూకంలో ఎలాంటి మోసాలుండవన్నారు. గ్రామ సంఘం సభ్యులు సంతోష, వసంత, అంజమ్మ, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

### ఉచిత ఖోఖో శిక్షణ

**పరిగి:** ఖేలో ఇండియా ఆధ్వర్యంలో సమ్మర్ ఉచిత ఖో ఖో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కోచ్ స్వాతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో మే 1 నుంచి 31 వరకు పదేళ్ల నుంచి 17 సంవత్సరాల వయస్సు లోపున్న బాలబాలికలకు, యువతీయువకులకు ఖో ఖోపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఉదయం 5.30గంటల నుంచి ఉదయం 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ఉంటుందున్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 8978294432, 9885637207 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### మేకల మందపై కుక్కల దాడి

15 జీవాలు మృత్యువాత



మేకల కళేబరాలు

**షాద్‌నగర్:** మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 మేకలు మృత్యువాత పడిన ఘటన సోమవారం ఉదయం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లయ్య వద్ద ఉన్న మేకల మందపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో 15 మేకలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. కుక్కల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.

### కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి

**మంచాల:** తాతల కాలం నుంచి కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన భూ బాధితులు వాపోయారు. ఆరుట్ల రెవెన్యూ పరిధిలోని 1605, 1606, 1607, 1608, 1611, 1612 సర్వే నంబర్లలో జంగయ్య, యాదయ్య, రాజు, రమేష్, జాంగీర్ బాబుమీయా, జయమ్మ తదితరులు పేర్ల మీద ఉన్న ఐదు ఎకరాల భూమిని ధరణిలో ఇతరుల పేర్లపై అక్రమంగా నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు తప్పుడు రికార్డులు నమోదు చేసి మాకు అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసమని బాధితులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కబ్జా చేయడానికి కిరాయి గుండాలతో దాడులకు దిగడమే గాకుండా పొలం చుట్టూ ఉన్న హద్దులను తొలగించాలని తెలిపారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వారు వేడుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మారెపల్లి గేటు వద్ద బోల్తాపడిన ఇన్నోవా



నరేందర్‌రెడ్డి (ఫైల్)



బోల్తాపడిన కారు

**పెద్దేముల్:** అతివేగంగా వస్తున్న ఓ కారు అదుపుతప్పి బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మారెపల్లి గేటు సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ గిరి కథనం ప్రకారం.. మారెపల్లి గ్రామానికి చెందిన కొమ్ము లాల్‌రెడ్డి, చౌడపూరం నరేందర్ రెడ్డి(35) ఆదివారం రాత్రి ఓగ్లాపూర్ గేటు నుంచి స్వగ్రామానికి ఇన్నోవా కారులో వస్తున్నారు. లాల్‌రెడ్డి డ్రైవింగ్ చేస్తుండగా నరేందర్‌రెడ్డి పక్కనే కూర్చున్నాడు. అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో మారెపల్లి గేటు సమీపంలో ఉన్న మైసమ్మ దేవాలయం వద్ద ఇన్నోవా టైరు పేలిపోయి బోల్తా పడింది. దీంతో కారు డోరు నుంచి నరేందర్‌రెడ్డి కిందపడి తలకు తీవ్రగాయమైంది. తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. డ్రైవర్ లాల్‌రెడ్డికి బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అతివేగంగా నడపడంతో తన భర్త మృతికి కారణమైన లాల్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని భార్య అపర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పోస్టుకార్డుల ద్వారా సీఎంకు వినతులు పంపిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, రైతులు

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

**పరిగి:** ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని రైతులతో పోస్టుకార్డుల ద్వారా వినతులను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని.. ఇప్పటి వరకు చేయలేదన్నారు. రైతు బంధు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు, పింఛన్ రూ.4 వేలు ఇస్తామని ఇప్పటి వరకు వాటి ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆశ చూపి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పంట పెట్టుబడి కింద రైతుబంధు అందాల్సి ఉండగా, నేటికి చాలా మంది రైతులకు అందలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, రాజు, సంతోష్, రవికుమార్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు సిద్ధం

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్




మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

**అనంతగిరి:** యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలు అన్ని సిద్ధంగా ఉన్నట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. సోమవారం సివిల్ సప్లయి కమిషనర్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయి అధికారులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటివారంలోనే ప్రారంభించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,19,350 మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం వస్తుందన్నారు. వీటిలో కొనుగోళ్లు సైతం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వరికి కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183లు చెల్లిస్తున్నారన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితులలో దళారులకు అమ్మవద్దని ఆయన కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని రైతుల సౌకర్యార్థం టెంట్లు, మంచి నీటిని కల్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### షాద్‌నగర్ అధ్యాపకుడికి డాక్టరేట్



రాజేందర్‌రెడ్డి

**షాద్‌నగర్‌రూరల్:** గురునానక్ ఇన్‌స్టిట్యూషన్ టెక్నికల్ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎస్.రాజేందర్‌రెడ్డి జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'డైనమిక్ ఓల్టేజ్ రీస్టోర్ అండ్ డిస్ట్రిబ్యూషన్ స్టాటిక్ కాంపెన్సేటర్ ద్వారా వివిధ పవర్ క్వాలిటీ సమస్యలను తగ్గించడం' అనే అంశంపై చేసిన అధ్యాయనానికి జేఎన్‌టీయూ ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రకటించింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

### బెల్టు దుకాణాలపై దాడులు

**యాచారం:** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం యాచారం పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న కిరాణా దుకాణాల్లో తనిఖీలో నిర్వహించి గ్రామానికి చెందిన యాదయ్య వద్ద నుంచి రూ.3 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం



ఎగిసి పడుతున్న మంటలు

**పహాడీషరీఫ్:** ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన హాజీబ్ స్థానికంగా ప్లాస్టిక్ గోదాంను నిర్వహిస్తున్నారు. అందులో ఉన్న యంత్ర విభాగంలో ఉదయం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ మృతదేహం

**కొత్తూరు:** ఉరేసు కుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రవీణ్(27) వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి అతడు తిరిగి రాలేదు. ఉదయం పొలానికి వెళ్లిన తండ్రి అంజయ్యకు చింతచెట్టుకు ఉరేసుకుని ప్రవీణ్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించగా అప్పటికే అతడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- కౌకుంట్లలో ఆయన సమాధి వద్ద నివాళి



ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఆమె తనయులు, ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల:** మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, స్థానిక నాయకులలో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వర్గీయ ఇంద్రారెడ్డి కన్న కలలు ఒక్కొక్కటిగా నేరవేరుతున్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ఆయన కల సాకారమయిందన్నారు. ప్రస్తుతం నాయకులు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంద్రారెడ్డి చూపిన మార్గంలో ఆయన అభిమానులు, అనుచరులు ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, శుభప్రద్‌పటేల్, మల్లారెడ్డి, గోపాలకృష్ణ, దశరథ్, ఇనాయత్, యాదగిరి, అంజయ్య, హన్మంత్‌రెడ్డి, మాధవ్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవ్‌రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**మండల పరిధిలో**

చేవెళ్ల మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, జి.చంద్రశేఖర్‌రెడ్డి, మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇంద్రారెడ్డి విగ్రహాల వద్ద వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.